సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

బుధవారం । 4 । జనవరి । 2023



గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం

పోరుమామిళ్ల పట్టణంలోని పాత పోస్టాఫీసు వీధిలో మంగళవారం గ్యాస్ లీకై అగ్నిప్రమాదం సంభవించింది. - 8లో



గంటలోపే కిడ్నాప్ కేసు ఛేదన

కడప రిమ్స్‌లో పసికందును ఓ మహిళ కిడ్నాప్ చేసింది. గంటలోపే నిందితురాలిని పట్టుకున్నారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.1 /17.7

జిల్లాలో మంగళవారం 17.7 – 31.1 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్.

పండుటాకులకు పరమానందం

- పెంచిన రూ. 2750 వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం
- జిల్లాలో 2,56,847 మందికి రూ. 70.89 కోట్లు మంజూరు
- జిల్లాలో కొత్తగా 7,609 మందికి పెన్షన్లు మంజూరు
- పెరిగిన పెన్షన్‌తో ఆనందంలో అవ్వాతాతలు, ఇతర పెన్షన్‌దారులు



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్, డీఆర్‌డీఏ పీడీ పెద్దిరాజు తదితరులు

కడప సిటీ : రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను గుర్తించే అవ్వాతాతలకు కూడా ఈసారి నూతన సంవత్సర కానుకను అందించడం ఆనందదాయకమని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం బహిరంగసభ నుంచి పెంచిన వైఎస్సార్ పెన్షన్ కానుక మొత్తాన్ని లబ్ధిదారులకు నేరుగా అందజేసే కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వీసీ ద్వారా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్థానిక వీసీ హాలు నుంచి డీఆర్వో గంగాధర్‌గౌడ్, డీఆర్‌డీఏ పీడీ పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

మెగా చెక్కు అందజేత

ముఖ్యమంత్రి వీసీ ముగిసిన అనంతరం జిల్లాకు చెందిన 2,56,847 మంది లబ్ధిదారులకు మంజూరైన వైఎస్సార్ పెన్షన్ కానుక లబ్ధి మొత్తం రూ. 70,89,00,25,000 చెక్కును డీఆర్వో గంగాధర్‌గౌడ్, డీఆర్‌డీఏ పీడీ పెద్దిరాజులు లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం వైఎస్సార్ పెన్షన్‌కానుక పథకం పోస్టర్లను వారు ఆవిష్కరించారు.

పథకం అమలు తీరుపై లబ్ధిదారుల్లో సంతోషం

ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'మీ పింఛన్–మీ గడప వద్దకే' పథకం అమలు తీరుపై ఇప్పటికే జిల్లాలోని లక్షలాది మంది లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రతి నెల వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, కల్లు గీత కార్మికులు, చర్మకారులు, నేతన్నలకు అందజేసే పింఛన్ మొత్తాన్ని క్రమక్రమంగా రూ. 3000 వరకు పెంచుతామన్న ముఖ్యమంత్రి ఇచ్చిన మాటలు వారికి నిజమైన భరోసాను ఇస్తున్నాయన్నారు. జిల్లాలో కొత్తగా మరో 7,609 మందికి పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మెప్మా అధికారులు, బ్యాంకు అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మా కష్టాలు తీరినట్లే



మాలాంటి పండుటాకులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సేవ వెలకట్టలేనిది. కనిపించే దేవుడిగా ఆయనను భావిస్తున్నాం. ఇచ్చిన మాటకు కట్టుబడి తండ్రికి మించిన తనయుడిగా చరిత్రలో నిలిచిపోతారు.
– ప్యారీజాన్, కాగితాలపెంట, కడప

పడిగాపులు కాసేవారం



గతంలో పింఛన్ తీసుకోవాలంటే పడిగాపులు కాస్తేగానీ వచ్చేది కాదు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి నిద్ర లేవకముందే తలుపుతట్టి నెల నెల పింఛన్ ఇస్తున్నారు.
– జి.సుబ్బరాయుడు, నాగరాజుపేట, కడప

పెన్షన్ ఆసరాగా నిలుస్తోంది



వైఎస్సార్ పెన్షన్ కానుక మా కుటుంబానికి ఆసరాగా ఉంది. మూడేళ్లుగా ప్రతి సంవత్సరం ప్రారంభంలో పెంచిన పెన్షన్ అందుకోవడం చాలా ఆనందంగా ఉంది. నాకు వృద్ధాప్య పెన్షన్‌తోపాటు నా భర్తకు దివ్యాంగుల కింద పింఛన్ వస్తోంది.
– షేక్ నూర్జహాన్, కడప

ఓటర్ల జాబితాను పూర్తి చేయాలి

- భారత ఎన్నికల కమిషన్ రోల్ అబ్జర్వర్ పీఎస్ ప్రద్యుమ్న
- కలెక్టర్ విజయరామరాజుతో కలిసి ఈఆర్వోలతో సమీక్ష

కడప సిటీ : ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా–2023ను ఎలాంటి పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని భారత ఎన్నికల కమిషన్ రోల్ అబ్జర్వర్ పీఎస్ ప్రద్యుమ్న అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో కలెక్టర్ విజయరామరాజు, నగర పాలక సంస్థ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్‌చంద్‌లతో కలిసి భారత ఎన్నికల కమిషన్ రోల్ అబ్జర్వర్ పీఎస్ ప్రద్యుమ్న ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్)–2023 అమలుపై ఈఆర్ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెలలో తుది ఎన్నికల జాబితా ప్రచురణ నేపథ్యంలో గత డిసెంబరు నెల 25 నాటికి జిల్లా ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితాను ఇప్పటికే సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. అందుకు సంబంధించిన కార్యాచరణ, పురోగతిపై ఈఆర్వోలు, ఏఈఆర్ఓలకు ఆయన దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ విధి విధానాల మేరకు అన్ని కార్యక్రమాలు ప్రణాళిక బద్ధంగా పూర్తి చేస్తున్నామన్నారు. డీఆర్వో గంగాధర్‌గౌడ్, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీఓలు ధర్మచంద్రారెడ్డి, శ్రీనివాసులు, వెంకట రమణ, వెంకటేశ్వర్లు, ఎన్నికల నోడల్ అధికారి శివారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భారత ఎన్నికల కమిషన్ రోల్ అబ్జర్వర్ పీఎస్ ప్రద్యుమ్న

క్లుప్తంగా

ఎలుగుబంటి దాడి

వ్యక్తికి తీవ్ర గాయాలు




గాయపడిన వెంకటయ్య

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామ సచివాలయం పరిధిలోని బుచ్చిరెడ్డి పాలెం గ్రామానికి చెందిన వెంకటయ్య అనే వ్యక్తి మంగళవారం ఎలుగుబంటి దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. వెంకటయ్య గడ్డి కోసం సమీపంలోని కొండకు వెళ్లగా.. అక్కడ ఎలుగుబంటి దాడికి గురయ్యాడు. వెంటనే అప్రమత్తమై ఎలుగుబంటి నుంచి తప్పించుకుని గాయాలతో ఇంటికి చేరుకున్నాడు. హుటాహుటిన వైద్యపరీక్షల నిమిత్తం కుటుంబ సభ్యులు బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. బాధితుడి కుటుంబ సభ్యులు బద్వేలు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మిస్సింగ్ కేసు నమోదు





అఫ్రాన్ భాను (ఫైల్), అయాన్ (ఫైల్)

చింతకొమ్మదిన్నె : మండలంలోని జమాల్‌పల్లికి చెందిన అఫ్రాన్‌భాను (24), ఆమె కుమారుడు అయాన్ (3) కనిపించడం లేదని పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఎస్ఐ భూమా అరుణ్‌రెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటికి చెందిన అఫ్రాన్ భానుకు సీకేదిన్నె మండలం జమాల్‌పల్లికి చెందిన ఇక్బాల్ బాషాకు 5 ఏళ్ల క్రితం వివాహం అయింది. మంగళవారం అఫ్రాన్ భానుతోపాటు తన కుమారుడు అయాన్‌ను బస్సు ఎక్కించానని ఇక్బాల్ బాషా తెలిపాడు. రాయచోటిలోని అత్తవారి ఇంటికి ఫోన్ చేసి ఇంటికి తీసుకువెళ్లాలని చెప్పానని ఆయన పేర్కొన్నాడు. అఫ్రాన్ భాను, అయాన్‌లు ఎంత సేపటికీ రాయచోటికి రాకపోడవడంతో అఫ్రాన్ భాను అక్క యాసీన్ భాను ఇక్బాల్ బాషాకు ఫోన్ చేసింది. అతను పొంతన లేని సమాధానాలు చెబుతుండటంతో వారికి అనుమానం వచ్చి సీకేదిన్నె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంటలోపే కిడ్నాప్ కేసు ఛేదన

- రిమ్స్‌లో పసికందు కిడ్నాప్
- సెక్యూరిటీ సిబ్బంది చొరవతో సురక్షితంగా తల్లి ఒడికి



నిందితురాలు సోనితో రిమ్స్ అధికారులు, సిబ్బంది



నిందితురాలు గర్భిణిగా నటిస్తూ కడుపులో దాచుకున్న సామగ్రి



తన బిడ్డతో తల్లి మాబుచాన్

కడప అర్బన్ : కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (రిమ్స్)లోని బాలింతల వార్డులో నుంచి ఎనిమిది రోజుల బాలుడిని ఓ మహిళ కిడ్నాప్ చేసుకుని వెళ్లింది. ఈ ఘటన సాయంత్రం 6.30 గంటల సమయంలో చోటుచేసుకుంది. అయితే మహిళ బాలుడిని కిడ్నాప్ చేసిన గంటలోపే రిమ్స్ సెక్యూరిటీ, శానిటేషన్ కాంట్రాక్టర్ బాలనాగిరెడ్డి, సెక్యూరిటీ సూపర్‌వైజర్ కరుణాకర్, జయప్రసాద్, మహిళా సెక్యూరిటీ గార్డు బాల నాగమ్మ, ఇతర సెక్యూరిటీ సిబ్బంది రాత్రి 7.30 గంటల్లోపు సురక్షితంగా తీసుకొచ్చి తల్లి మాబుచాన్‌కు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి.

కమలాపురం పరిధిలోని చిన్నచెప్పలి గ్రామానికి చెందిన మాబుచాన్, హనీఫ్‌లు మొదటి కాన్పు కోసం గత నెల 26వ తేదీన రిమ్స్‌కు వచ్చారు. అదే రోజు 11.40 గంటలకు వైద్యులు సిజేరియన్ చేయడంతో మాబుచాన్ మగబిడ్డకు జన్మనిచ్చింది. తర్వాత విశ్రాంతి కోసం బాలింతను పోస్ట్ నెంటల్ (బాలింత) వార్డులో చేర్పించారు. అప్పటి నుంచి విశ్రాంతి తీసుకుంటున్న మాబుచాన్ వద్దకు నిందితురాలైన సోని గర్భవతి లాగా వచ్చి సెల్‌ఫోన్ ఛార్జింగ్ పెట్టుకుంది. మాటకుమాట కలుపుతూ మాబుచాన్ విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో.. పసిబిడ్డను ఎంచక్కా తన బురఖాలో దాచి పెట్టుకుని బయటికి వచ్చింది. ఆటోలో నగరానికి బయలుదేరింది. చిన్నారిని ఎవరో తీసుకెళ్లారని, తన బిడ్డ కనిపించడం లేదని మాబుచాన్ లబోదిబోమంటూ వార్డులో నుంచి ఏడుస్తూ బయటికి వచ్చింది. ఆ సమయంలో మహిళా సెక్యూరిటీ గార్డు బాల నాగమ్మ అప్రమత్తమై వెంటనే సూపర్‌వైజర్లు కరుణాకర్, జయప్రసాద్‌కు సమాచారం అందించింది. వారు సెక్యూరిటీ సిబ్బందితో కలిసి ఆటోవారిని అప్రమత్తం చేయడంతోపాటు కాంట్రాక్టర్ బాల నాగిరెడ్డికి విషయాన్ని తెలియజేశారు. అందరూ కలిసి కడప నగరంలోని ఆటోల వెంట వచ్చారు. సదరు మహిళ ఐటీఐ సర్కిల్ సమీపంలో సాయిబాబా స్కూలు వీధిలో బిడ్డను తీసుకుని వెళుతుండగా.. సెక్యూరిటీ వారు విచారణ చేస్తూ వచ్చి ఆమెను పట్టుకున్నారు. మొదట సదరు నిందితురాలు సోని తన బిడ్డే అంటూ బుకాయించింది. తర్వాత విచారణ చేపట్టగా ఆమె తనకు పిల్లలు లేరని, తమది అక్కాయపల్లె అని, పెంచుకునేందుకు తీసుకువచ్చానని తెలియజేసింది. బిడ్డతోపాటు ఆమెను రిమ్స్ తీసుకొచ్చారు. పసిబిడ్డను తల్లి మాబుచాన్‌కు అప్పగించారు. గంటలోపే తన చిన్నారిని తీసుకొచ్చిన రిమ్స్ సెక్యూరిటీ సిబ్బంది, అధికారులకు మాబుచాన్ కృతజ్ఞతలు తెలియజేసింది. నిందితురాలు సోని గర్భవతిగా నటిస్తోందని, ఆమె బురఖాలోని రబ్బరు లాంటి సామగ్రిని ఆమె చేతనే బయటికి తీయించారు. రిమ్స్ సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ రాజేశ్వరి, కాంట్రాక్టర్ బాలనాగిరెడ్డి, సెక్యూరిటీ సిబ్బంది నిందితురాలు సోనిని ఎస్ఐ ప్రతాప్‌రెడ్డికి అప్పగించారు. ఈ నేరం నిందితురాలు సోని ఒక్కరే చేసిందా? ఈమె వెనుక ఏదైనా గ్యాంగ్ ఉందా? అనే విషయమై పోలీసులు సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు



ప్రమాదానికి కారణమైన సిలిండర్లు, రూమ్

ఐదుగురికి గాయాలు, ఒకరి పరిస్థితి విషమం

పోరుమామిళ్ల : పట్టణంలోని పాత పోస్టాఫీసు వీధిలో మంగళవారం గ్యాస్ లీకై అగ్నిప్రమాదం సంభవించింది. ఈ సంఘటనలో ఓ మహిళ తీవ్రంగా గాయపడగా, మరో నలుగురు స్వల్ప గాయాలపాలయ్యారు. తీవ్రంగా గాయపడిన రజియాబీ (50) పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. బాధితులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఓ చిన్న రూమ్‌లో రజియాబీ దుకాణం ఏర్పాటు చేసి, టిఫిన్ సెంటర్ పెట్టుకుని జీవనం సాగించేది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం రూమ్ తెరవగా గ్యాస్ వాసన వస్తుండటంతో.. భర్తకు ఫోన్ చేసి సిలిండర్ లీక్ అయి గ్యాస్ అంతా అయిపోయినట్లుంది, ఇంటి నుంచి మరో సిలిండర్ తీసుకురావాలని చెప్పింది. ఆయన వచ్చే దాకా ఆగకుండా లైటర్‌తో స్టౌ వెలిగించేందుకు ప్రయత్నించగా.. రూము నిండా ఉన్న గ్యాస్ వల్ల పెద్దగా మంటలు లేచి ఆమెను చుట్టుముట్టాయి. ఒక్కసారిగా మంటలు చుట్టుముట్టడంతో ఆమె భయంతో గట్టిగా కేకలు వేసింది. సిల్క్‌చీర కావడంతో మంటలతో చీర శరీరానికి అతక్కుపోయింది. ఆమె కేకలతో పక్కనే ఉన్న జమాల్‌బీ (49), అబ్దుల్‌అజీజ్(9) అక్కడికి వెళ్లడంతో మంటలు తగిలి వారూ గాయపడ్డారు. అదే సమయంలో వీధిలో వాకింగ్ చేస్తున్న రహమత్‌బీ, రహీంబీ అనే మహిళలు కేకలు వినపడి రూము నుంచి పొగలు వస్తుండటంతో.. అక్కడికి వెళ్లారు. లోపలి నుంచి మంటలు ఒక్కసారిగా వారిపైకి దూసుకు రావడంతో వారూ కేకలు వేస్తూ రోడ్డుపైకి పరుగెత్తారు. వారిద్దరూ గాయపడ్డారు. అందరినీ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా డాక్టర్ ప్రథమ చికిత్స అనంతరం కడప రిమ్స్‌కు పంపించారు. రజియాబీ శరీరం బాగా కలడంతో ఆమె పరిస్థితి సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో విలేకరి దుర్మరణం



మారుతిరాజు (ఫైల్)

గోపవరం : మండలంలో ఓ దినపత్రిక విలేకరిగా పని చేస్తున్న పి.మారుతిరాజు (54) సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. శ్రీనివాసపురం సమీపంలో ఉన్న ఎస్‌కేపీ వెంచర్‌లో నివాసముంటున్న మారుతిరాజు సోమవారం రాత్రి బద్వేలు నుంచి ద్విచక్ర వాహనంలో ఇంటికి వస్తుండగా.. అదుపుతప్పి కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన కొన్నేళ్లుగా ఓ దినపత్రిక రిపోర్టర్‌గా మండలంలో పని చేస్తున్నారు. విషయం తెలుసుకున్న స్థానికులతో పాటు కుటుంబ సభ్యులు సంఘటన ప్రాంతానికి చేరుకున్నారు. సమాచారం తెలుసుకున్న బద్వేలు రూరల్ సీఐ హనుమంతనాయక్, సిబ్బంది ఘటన ప్రాంతానికి చేరుకుని ముందుగా మృతదేహాన్ని వెంచర్‌లోని తన నివాసానికి తరలించారు. మంగళవారం ఉదయం బద్వేలు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి స్వగ్రామమైన బద్వేలు మున్సిపాలిటీ గూడెం గ్రామానికి తరలించి అక్కడ అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బాధితులకు బంగారం అప్పగింత



బాధితులు, బంగారు నగలతో సీఐ, ఎస్ఐ, పోలీసులు

జమ్మలమడుగు : ఐదు లక్షల విలువ గల పది తులాల బంగారాన్ని పోలీసులు 48 గంటల్లో బాధితులకు అందించి ప్రజల మన్ననలు పొందారు. అర్బన్ సీఐ సదాశివయ్య తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గత నెల 31న మోరగుడి గ్రామానికి చెందిన చంద్రశేఖర్ దంపతులు నూతన సంవత్సరం వేడుకలు జరుపుకొనేందుకు పట్టణంలో షాపింగ్‌కు వచ్చారు. షాపింగ్ చేసుకుని తిరిగి వెళ్తున్న సమయంలో పది తులాల బంగారానికి సంబంధించిన బ్యాగ్‌ను పోగొట్టుకున్నారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు అప్రమత్తమై ముందు జాగ్రత్త చర్యలో భాగంగా పట్టణంలోని బంగారు దుకాణం యజమానులకు సమాచారం అందించారు. అనంతరం ఎస్ఐ సుబ్బారావు, కానిస్టేబుల్ మధుసూదన్‌రెడ్డి, ఈశ్వరయ్య పలు ప్రాంతాలలో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించారు. అయితే బంగారం ఉన్న బ్యాగ్ దొరికిన ఓ మహిళ అమ్ముకునే ప్రయత్నం చేశారు. దీంతో బంగారు వ్యాపారులు పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే వచ్చి బంగారు నగల బ్యాగ్‌ను స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేశారు. దీంతో ఎస్పీ అన్బురాజన్ జమ్మలమడుగు పోలీసులకు అభినందనలు తెలిపారు.

చిరుత కదలికలపై నిఘా

ముద్దనూరు : గండికోట జలాశయం రహదారి పరిసర ప్రాంతాల్లో చిరుత పులి సంచరిస్తున్నట్లు స్థానికుల భయాందోళన నేపథ్యంలో అటవీ శాఖాధికారులు చర్యలు చేపడుతున్నారు. మండలంలోని శెట్టివారిపల్లె గ్రామ శివారులో ఊటు కోన వద్ద గత కొద్ది నెలలుగా పులి సంచరిస్తూ గొర్రెలు, మేకలను చంపుతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సోమవారం చిరుత దాడి చేసి మేకలను చంపడం ప్రత్యక్షంగా చూశామని స్థానికులు అటవీ అధికారులకు సమాచారం అందించారు. చిరుత సంచార ప్రదేశం గ్రామానికి సమీపంలోనే వుండడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. దీంతో పులి కదలికను పసిగట్టి దాన్ని పట్టుకునేందుకు వనిపెంట అటవీ ప్రాంతం నుంచి 4 కెమెరాలను తెచ్చి శెట్టివారిపల్లె కొండలో ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక అటవీశాఖ డీఆర్వో చంద్రశేఖర్‌రావు తెలిపారు. పులి దాడిలో చనిపోయినట్లు అనుమానం వుండడంతో మంగళవారం రెండు జీవాలకు మండల పశువైద్యాధికారి శ్రీనివాస పోస్టుమార్టం నిర్వహించారు.

అంధ విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపాలి

- జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి
- ఘనంగా ప్రారంభమైన లూయీ బ్రెయిలీ జయంతి ఉత్సవాలు



మాట్లాడుతున్న అంబవరం ప్రభాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : అంధ విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాలని జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. జనవరి 4న లూయీ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని మంగళవారం కడపలోని ప్రభుత్వ అంధుల ఉన్నత పాఠశాలలో జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ ఫౌండేషన్ ఆఫ్ ది బ్లైండ్ సంస్థ సహకారంతో ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అంధ విద్యార్థులకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు. ఈ క్రీడా పోటీలను నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతోందన్నారు. అలాగే వినికిడి యంత్రాలు, ఎలక్ట్రికల్ మెటార్ బైక్‌లు వంటివి అందిస్తోందన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన లూయీ బ్రెయిలీ విగ్రహానికి సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి, వికలాంగుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణకిషోర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శంకరయ్య, బీసీ వెల్ఫేర్ సభ్యులు మనోజ్‌కుమార్, నేషనల్ ఫౌండేషన్ ఆఫ్ ది బ్లైండ్ అసోసియేట్ కో ఆర్డినేటర్ వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఉపాధ్యాయుడి మృతి



ఎస్.నవీన్‌కుమార్ మృతదేహం

కొండాపురం : మండల పరిధిలోని కె.సుగుమంచిపల్లె గ్రామంలో వ్యాయామ ఉపాధ్యాయుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ జె.రవికుమార్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తాళ్లప్రొటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఎస్.నవీన్‌కుమార్ (42) విధులు నిర్వర్తిస్తున్నాడు. ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన ఎస్. సుబ్బారావు కుమారుడు ఎస్.నవీన్‌కుమార్ కె.సుగుమంచిపల్లెలో అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నాడు. ఆయన, భార్య విడాకుల కేసు కోర్టులో జరుగుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. నవీన్‌కుమార్ ఇంటిలో చనిపోయి దాదాపు రెండు రోజులు కావడంతో దుర్వాసన రావడం వల్ల చుట్టుపక్కల వారు మంగళవారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే అక్కడికి చేరుకున్నారు. ఇంటి లోపల లాక్ వేసి ఉండటంతో డోర్ పగలగొట్టి మృతదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఏ కారణంతో చనిపోయింది స్పష్టంగా తెలియకపోవడంతో.. అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లుగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కెనరా బ్యాంక్‌లో చోరీ

జమ్మలమడుగు : పట్టణంలోని ప్రొద్దుటూరు రహదారిలో ఉన్న కెనరా బ్యాంక్‌లో దొంగలు పడ్డారు. బ్యాంక్‌లో ఉన్న రెండు కంప్యూటర్లు, ట్యాబ్‌లను తీసుకెళ్లినట్లు సీఐ సదాశివయ్య పేర్కొన్నారు. మంగళవారం ఉదయం బ్యాంక్ మేనేజర్ ఈశ్వరయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు బ్యాంక్‌లో తనిఖీలు చేపట్టారు. బ్యాంక్ మేనేజర్ కూర్చునే కౌంటర్ వెనుక వైపు ఉన్న డ్రిల్‌ను తొలగించి లోపలికి వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. పోలీసులు జాగిలాలను రప్పించి బ్యాంక్‌లో తనిఖీలు చేపట్టారు. అనంతరం సీఐ మాట్లాడుతూ కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

కడప రాయునికి ద్వాదశి చక్రస్నానం



చక్రతాళ్వార్‌కు చందనాభిషేకం

కడప కల్చరల్ : తిరుమలేశునికి తొలిగడపగా భావించే దేవునికడప శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ద్వాదశిని పురస్కరించుకుని ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీ చక్రస్నానం, పూజలు నిర్వహించారు. తిరుమల–తిరుపతి దేవస్థానాల అనుబంధంగా ఉన్న ఈ ఆలయ ఆవరణలో ప్రత్యేక పీఠంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి పట్టు వస్త్రాలు, సువర్ణ ఆభరణాలు, పుష్పమాలలతో అలంకరించారు. దేవతామూర్తుల ఎదుట స్నాన పీఠంపై శ్రీ చక్ర తాళ్వార్ ఉత్సవమూర్తిని కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, తులసీ దళార్చన చేసి దూపం, కర్పూర హారతి, మంత్రజలంతో సహస్ర దారాభిషేకం నిర్వహించారు. ఈ మంగళ జలాన్ని కార్యక్రమానికి హాజరైన భక్తులపై చల్లి సంప్రోక్షణ చేశారు. భక్తులు విశేష సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు. అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఇళ్ల నిర్మాణంలో పురోగతి ఉండాలి

కలెక్టర్ విజయరామరాజు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సిటీ: గృహ నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం వహించకుండా పురోగతి చూపించాలని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ సభా భవనంలో నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనాలతో కలిసి జగనన్న హౌసింగ్ కాలనీల్లో పనుల పురోగతి తదితర అంశాలపై మండల, నియోజకవర్గ స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ కృష్ణయ్య, ఆర్డీఓలు, హౌసింగ్ అధికారులు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దారులు, ఎంపీడీఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గడువులోపు అభివృద్ధి పనుల పూర్తికి ఆదేశం

పులివెందుల రూరల్ : పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, అన్ని శాఖల అధికారులతో కలిసి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కమిషనర్ నరసింహారెడ్డి, ఆర్డీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మాధవ కృష్ణారెడ్డి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

డిసెంబర్‌లోగా పెండింగ్ పనులు పూర్తి చేయండి

వేంపల్లె : ఈ ఏడాది డిసెంబర్‌లోగా వేంపల్లె మండలంలో ఉన్న పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం వేంపల్లె మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, ఏపీఎంఐడీసీ ఏఈ సుకుమార్, సిబ్బంది, కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రిలో బాలింత మృతి

కడప అర్బన్ : కడప నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మంగళవారం ఓ బాలింత బిడ్డకు జన్మనిచ్చి అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతి చెందింది. వైద్యులు సక్రమంగా వైద్యం చేయకపోవడంతోనే బాలింత మృతి చెందిందని బంధువులు ఆరోపించారు. కడపకు చెందిన మహిళను ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ప్రసవం కోసం చేర్పించారు. సిజేరియన్ చేయడంతో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. మత్తు మందు సరిగా పనిచేయకపోవడంతో బాలింత అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కాసేపటికి ఆమెను మరో ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. బంధువులు తమకు ఎలాంటి కేసు అవసరం లేదని మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకుని వెళ్లారు. పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.